క్లుప్తంగా

ఆర్టీసీ స్టార్‌లైనర్‌లో సాధారణ చార్జీలు

మదనపల్లె సిటీ: మదనపల్లె–హైదరాబాద్ ఆర్టీసీ స్టార్‌లైనర్‌లో సాధారణ చార్జీలతో నడుపుతున్నట్లు ఆర్టీసీ 1 డిపో మేనేజర్ మూరే వెంకటర మణారెడ్డి తెలిపారు. ప్రయాణికుల అభ్యర్థన మేరకు హైదరాబాదు నుంచి బీహెచ్ఈఎల్ వరకు పొడిగించినట్లు తెలిపారు. ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ప్రయాణికులు స్టార్‌లైనర్‌లో ప్రయాణించాలని కోరారు.

రేపు వాహనాల వేలం

ములకలచెరువు: స్థానిక ఎస్ఈబీ కార్యాలయంలో వివిధ కేసులో పట్టుబడిన వాహనాల వేలం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు రూ.5 వేలు టోకన్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం

తంబళ్లపల్లె: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై చూపుతున్న నిర్లక్ష్య వైఖరిపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేయాల్సిందేనని జిల్లా నాయకులు మనోహర్ కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులో ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందక్రిష్ణమాదిగ చేపట్టనున్న విశ్వరూప సభకు మాదిగలు ఐక్యంగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవీంద్ర, మల్లికార్జున, వెంకటప్ప, రమణ, గోపిదిన్నె మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

30న ఉచిత వైద్య శిబిరం

మదనపల్లె సిటీ: లయన్స్‌క్లబ్ అభయ ఆధ్వర్యంలో ఈనెల 30న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరి ఆలయంలో వైద్య శిబిరం నిర్వహించనున్నారు. బెంగళూరు నారాయణ హృదయాల, జాలప్ప మెడికల్ కాలేజీ వైద్య బృందం చికిత్స చేస్తారన్నారు. అవకాశాన్ని చేనేత కార్మికులు, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గౌరమ్మకు ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె: పుణ్యక్షేత్రం మల్లయ్యకొండపై ఉన్న భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి, గౌరమ్మ ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చారు. గౌరమ్మదేవి ఆలయంలో అమ్మవారికి పూజారి శేఖర్ ప్రత్యేక అలంకరణ చేసి పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రధాన ఆలయంలో పూజారి ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దాతలు ఈశ్వరప్ప, వెంకటసుబ్బమ్మ దంపతులు భక్తులకు అన్నసంతర్పణ చేశారు. వారిని ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, కొండకిట్టాలు అభినందించారు.

జీఈఆర్ సర్వే వంద శాతం పూర్తి చేయాలి

కేవీపల్లె : గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) సర్వే వందశాతం పూర్తి చేయాలని ఎంఈవో రెడ్డిబాషా అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లతో జీఈఆర్ సర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 నుంచి 18 సంవత్సరాలు వయస్సు కలిగిన విద్యార్థులందరూ జీఈఆర్ సర్వేలో నమోదు కావాలన్నారు. సీఆర్ యాప్ గ్రామ వలంటీర్ లాగిన్‌లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

పరిశుభ్రతపై అవగాహన

తంబళ్లపల్లె: మహిళలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన ముఖ్యమని, అప్పుడే ఆరోగ్యం చేకూరుతుందని హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకు అబూబకర్ సిద్దిక్ తెలిపారు. సోమవారం తంబళ్లపల్లెలో మహిళలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నెలసరి సమయాల్లో వాడే ప్యాడ్స్ వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో పురుషోత్తం, సునీల్, పవన్, దినకర్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లేళ్లమందలో కార్డెన్ సెర్చ్

కేవీపల్లె : అక్రమంగా సారా తయారీ, మద్యం విక్రయాలు అరికట్టడంలో భాగంగా మండలంలోని జిల్లేళ్లమందలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సోమవారం రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా ఆదేశాల మేరకు కలకడ, పీలేరు, రాయచోటి రూరల్ సీఐలు పి. నాగేంద్ర, మోహన్‌రెడ్డి, తులసీరామ్, కలికిరి ఎస్ఐ రహిముల్లా, కేవీపల్లె పోలీస్ సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో విస్తృతంగా సోదాలు చేసి 10 లీటర్ల సారా, 27 మద్యం బాటిల్లు స్వాధీనం చేసుకుని గ్రామానికి చెందిన నిందితులు నాగమ్మ, సుబ్బరామ్ నాయక్‌లను అరెస్ట్ చేశారు. అనంతరం గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించి సారా వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు.

ప్రత్యేక ప్రతిభావంతులను ఆదుకోవాలి

పీలేరు రూరల్ : ప్రత్యేక ప్రతిభావంతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ అన్నారు. సోమవారం పీలేరులో వికలాంగుల హక్కుల పోరాట సమితి 16వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులను ఘనంగా సన్మానించారు. నాయకులు చలపతి, వెంకటరమణ, రామ్మోహన్‌రెడ్డి, చిన్నరెడ్డెప్ప, అమరనాథ్‌రెడ్డి, ఎంఎస్‌పీ నాయకులు హుస్సేనయ్య, చరణ్, రెడ్డికుమార్, భాస్కర, అన్నవరం, రాజేష్ పాల్గొన్నారు.

పేద వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : పేద వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం పీలేరు పట్టణంలోని ఆర్టీసీ నల్లగుట్ట, ఎస్‌కేడీ నగర్‌లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి గడిచిన నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు చదివి వినిపించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటూ తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీ సమస్యలు, హౌసింగ్‌పై వచ్చిన అర్జీలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీల్లో దాదాపు వందశాతం అమలు చేసిన ఘనత మన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన తీసుకొచ్చారని పేర్కొన్నారు.

సమష్టి కృషితో పార్టీని బలోపేతం చేద్దాం

వచ్చే ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేయడానికి సమష్టి కృషితో పార్టీని బలోపేతం చేద్దామని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వీఎస్ఆర్ కల్యాణమండపంలో నియోజకవర్గ స్థాయి ×మా నమ్మకం నీవే జగన్, జేసీఎస్ నమోదు శిబిరం× నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయ మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ అధిష్టానం ఉచిత బీమా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. మరో నాలుగు నెలల్లో ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కోసం చురుగ్గా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు హబీబ్‌బాషా, దండు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు హుమయూన్, మహితా ఆనంద్, నాగరాజమ్మ, బారేషా, షేక్ షావలి, సపూరా, ఉదయ్, శ్రీనాథరెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రమేష్‌రెడ్డి, నీళ్ళ భాస్కర్, కమలాకర్‌రెడ్డి, గ్రామ సచివాలయ మండల కన్వీనర్లు ఆనంద్, సతీష్‌రెడ్డి, మోహన్‌రాజ, రవి, రాయుడు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యదేవరపల్లెకు తారురోడ్డు

– నెరవేరిన గ్రామస్తుల 35 ఏళ్ల కల



రోడ్డు నిర్మాణపనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

మదనపల్లె : పోతబోలు రోడ్డు నుంచి మల్లయ్యదేవరపల్లెకు తారురోడ్డు నిర్మాణానికి సోమవారం నాయకులు భూమిపూజ చేశారు. 35 ఏళ్లుగా మల్లయ్యదేవరపల్లె గ్రామస్తులు పోతబోలు రోడ్డు నుంచి తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాల్సిందిగా చేస్తున్న వినతులు ఎట్టకేలకు ఫలించాయి. ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా దృష్టికి మల్లయ్యదేవరపల్లె గ్రామస్తుల దారి సమస్యను సర్పంచ్ ఈశ్వరయ్య తీసుకెళ్లి, ఎన్నికల సమయంలో రోడ్డు వేస్తామని ఇచ్చిన హామీని గుర్తుచేశారు. దీంతో స్పందించిన ఎంపీ, ఎమ్మెల్యేలు ఈఏపీ గ్రాంట్ కింద 2.50 కి.మీ.మేర తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. సోమవారం సర్పంచ్ ఈశ్వరయ్య, ఎంపీటీసీ వెంకటేష్, జేసీఎస్ మండల కన్వీనర్ పోతబోలు నాగరాజ, రత్నయ్య, గ్రామస్తులతో కలిసి రహదారి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. దారి సమస్యను పరిష్కరించినందుకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడానికే పల్లెబాట



పర్తికోటలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ములకలచెరువు: గ్రామాల్లో నెల కొన్న ప్రజా సమస్యలు పరిష్కరించడానికే పల్లెబాట కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీపీ సాయిలీలా అన్నారు. సోమవారం మండలంలోని పర్తికోట పంచాయతీలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. పర్తికోటలో పార్టీ జెండాను ఆవిష్కరించి, కాలనీలో రూ. 7 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రజా సమస్యలు వింటూ ఆయా శాఖల అధికారులు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు అధికారులకు ఆదేశించారు. కుల, మతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వాని ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గౌరీశంకర్‌రెడ్డి, సర్పంచులు మనోహరమ్మ, ప్రభావతమ్మ, ఎంపీటీసీ నరసింహులు నాయుడు, నాయకులు కేశవరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, యర్రగుడి రవిశేఖర్‌రెడ్డి సుధాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, చక్రపాణినాయుడు, రెడ్డిశేఖర, టంగుటూరి విశ్వనాథ్, ఉమామహేశ్వర్, చాంద్‌బాషా తదితరులు ఉన్నారు.

పల్లెబాటలో సమస్యలు పరిష్కారం

కురబలకోట: మండలంలోని ముదివేడు, శిద్దేవారిపల్లెలో సర్పంచ్ సహనాజ్ బేగం ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లె బాటలో విద్యుత్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలతో పాటు వివిధ సమస్యలు పరిష్కారం అయ్యాయి. సీఎం జగన్ ప్రభుత్వ పథకాలు జనాదరణ పొందాయని జెడ్పీటీసీ బైసాని జ్యోతి, బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి, అంగళ్లు మార్కెట్ కమిటీ చైర్మన్ డీఆర్. ఉమాపతిరెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని వారు కోరారు. ఎం. అంజాద్ ఖాన్, నౌషాద్, కరీముల్లా, బాషా, ఈశ్వర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డి, కులదీప్ రెడ్డి, మధు, వెంకటరెడ్డి, రాజశేఖర్, గోపి, అర్జున్‌రెడ్డి, రెడ్డెప్ప, ఎంపీడీఓ దిలీప్‌కుమార్, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా జగనన్న పాలన



టి.సదుం పంచాయతీలో ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న నాయకులు

పెద్దతిప్పసముద్రం: దేశ చరిత్రలో నిలిచిపోయేలా సీఎం జగనన్న అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారని ప్రజా ప్రతినిధులు మహమూద్, శివన్న, సుబ్బరాం, డ్రిప్ రమణ అన్నారు. సోమవారం పల్లెబాటలో భాగంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు టి.సదుం పంచాయతీలో పర్యటించారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన ఘనత జగనన్నకే దక్కిందని ప్రజలకు వివరించారు. గడప, గడపకూ వెళ్ళి ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన విధానాన్ని వివరిస్తూ అర్హులై ఇంకా ఏమైనా పథకాలు అందకుంటే వాటిని పరిష్కరించే దిశగా ముందుకు సాగారు. రాబోవు ఎన్నికల్లో మళ్ళీ జగనన్నను సీఎంగా ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. మంచి చేసే ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని ప్రజలను కోరారు. సర్పంచ్ శారద, ఎంపీటీసీ జయలలిత, ఉప సర్పంచ్ పీఎస్ మధు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆర్‌పీ క్రిష్టారెడ్డి, రవిచంద్రారెడ్డి, బొమ్మే వెంకట్, గిలీట, మంజునాథ్, ఈశ్వర్‌రెడ్డి, విజ్జీ, ఆంజినేయరెడ్డి, కుంచే శీనూ, భాస్కర్‌నాయుడు, గణపతిరెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొమ్మేపల్లి



కొమ్మేపల్లి శ్రీనివాసులు

నిమ్మనపల్లె: వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా అగ్రహారం పంచాయతీ పూలవాండ్లపల్లెకు చెందిన కొమ్మేపల్లి శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం కమిటీ వివరాలను ఇటీవల వెలువడించింది. గత కొన్ని సంవత్సరాలుగా వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా పని చేస్తూ, గతంలో రాజంపేట వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన శ్రీనివాసులరెడ్డికి మరోసారి జిల్లా కమిటీలో స్థానం కల్పించింది. ఈ సందర్భంగా తనకు పదవి వచ్చేందుకు సహాయసహకారాలు అందించిన ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఉమ్మడి జిల్లా టెలికాం బోర్డు మెంబర్ హర్షవర్థన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ పాలనకు మళ్లీపట్టం కట్టాలి



సమస్యలను తెలుసుకుంటున్న ప్రజాప్రతినిధులు

తంబళ్లపల్లె: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలన కోసం మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి కోరారు. సోమవారం గుండ్లపల్లె పంచాయతీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ మౌలాలి ఆధ్వర్యంలో పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిపల్లెలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందిన తీరుపై ఆరా తీశారు. ప్రజలు ప్రభుత్వం ఇస్తున్న పథకాలు నేరుగా ప్రజలకే చెందుతున్నాయని, కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీదే అన్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్, ఏపీఓ అంజనప్ప, ఏపీఎం గంగాధర్, సింగిల్‌విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ రెడ్డిమల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కరీమ్, నాయకులు కోటిరెడ్డి, శివారెడ్డి, రామూర్తి, రవీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

– ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ మురళి

మదనపల్లె : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజాసమస్యలపై ప్రజలు సమర్పించిన అర్జీలను తక్షణమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా కురబలకోట మండలం కన్నసానివారిపల్లెకు చెందిన వెంకటరమణ మదనపల్లె మండలం బీకేపల్లె పంచాయతీ సర్వేనెం.191–2ఏలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిపట్టాకు సంబంధించి మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌టీఐ కింద సమాచారం కోరితే ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని ఫిర్యాదు చేశాడు. తంబళ్లపల్లె మండలం ఎద్దులవారిపల్లె గ్రామం ఖాతానెంబర్.775కు సంబంధించి రెవెన్యూ అధికారులు మంజూరు చేసిన పాసుపుస్తకాలలో పొరపాటుగా అన్న స్థానంలో తమ్ముడి ఫోటో, తమ్ముడి స్థానంలో అన్నఫోటోను ముద్రించి ఇచ్చారని ఈదల సుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేశారు. దీంతో తమకు ప్రభుత్వం నుంచి అందాల్సిన రైతుబంధు, ఇతర పథకాలు అందకపోగా, ఇతరత్రా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వీటిని సవరించి కొత్త పాసుపుస్తకాలు మంజూరుచేయాలని ఏడాదికాలంగా రెవెన్యూ అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయాడు. మున్సిపాలిటీలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో బీకే.పల్లె చంద్రాకాలనీలో పైపులైన్ లేకపోవడంతో నీటిసమస్య అధికంగా ఉందని, కొళాయిలు వేసుకునేందుకు పైప్‌లైన్ వేయాల్సిందిగా స్థానికులు వినతి చేశారు.

అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలని ఫిర్యాదు

కలికిరి: ఏలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన మదర్సా, మసీదు నిర్మాణాలను చేపట్టిన నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని గుట్టపాళెం గ్రామస్తులు సోమవారం తహసీల్దారు భాగ్యలతకు ఫిర్యాదు చేశారు. గుట్టపాళెం రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెం.1496/1 స్థలము డీకేటీ అయినప్పటికీ ఆ స్థలంలో ఏలాంటి ముందస్తు అనుమతులు తీసుకోకుండా రాత్రికి రాత్రే బోరు వేయించడం, నిర్మాణాలు చేపటడంతో ఆదివారం రాత్రి గ్రామస్తులు అడ్డుకున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో రైతుల వ్యవసాయ బోర్లు ఉన్నా నిర్వాహకులు ఖాతరు చేయకుండా బోరు తవ్వకం చేపట్టడం, నిర్మాణాలు ప్రారంభిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన తహసీల్దారు విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

డిగ్రీ రెండో విడత ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ ప్రారంభం

వాల్మీకిపురం: స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు రెండో విడత రిజిస్ట్రేషన్ కార్యక్రమంప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి తెలిపారు. గతంలో ఒక కళాశాలలో చేరినటువంటి విద్యార్థినీ, విద్యార్థులు కూడా కళాశాలను మార్చుకొనుటకు అవకాశం ఉందన్నారు. అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు కళాశాలలో నేరుగా సంప్రదించవచ్చన్నారు. లేదా 944080402 నంబర్‌ను సంప్రదించి పూర్తి సమాచారం తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు



యర్రసానివారిపల్లెలో పల్లెబాట నిర్వహిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

పెద్దమండ్యం: అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. మండలంలోని గుర్రంవాండ్లపల్లె పంచాయతీలోని నక్కలవారికోట, నాగూరువాండ్లపల్లె, బత్తినగారిపల్లె, బత్తినగారిపల్లె తండా, గుర్రంవాండ్లపల్లె, గుట్టకిందతండా, కోటకాడపల్లె పంచాయతీలోని చెరువుకిందుపల్లె, బండకాడపల్లె, కోటకాడపల్లె హరిజనవాడ, కోటకాడపల్లె, తాటిమాకులపల్లె, శెట్టివారిపల్లె, యర్రసానివారిపల్లెల్లో సోమవారం పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటికి వెళ్లి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలకు అర్హులై ఉంటే వెంటనే వారికి సంక్షేమ పథకాలను అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పీరమ్మ, తహసీల్దార్ రాము, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, సర్పంచ్‌లు భూదేవి, సుధాకర, బాషా, విశ్వనాథ, విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీలు బోడెం రవితేజ, మంచూరి జయరాం, సచివాలయ కన్వీనర్ సగినాల కేశవ, పార్టీ మండల కన్వీనర్ చాను, రెడ్డెప్పరెడి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చికిత్స కోసం నగదు సాయం



విద్యార్థిని తల్లికి నగదు అందజేస్తున్న దృశ్యం

రామసముద్రం: రామసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని జైబాసుహనకు చికిత్స నిమిత్తం సోమవారం పలువురు నగదు సహాయం అందజేశారు. కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన చింతల రమేష్ బాబు రూ.5116లు, వారి సోదరుడు సీనియర్ ఇంజనీర్ అయిన చింతల చంద్రబాబు రూ.10116లు, కళాశాల ప్రిన్సిపాల్ మురళిధర్ ఆధ్వర్యంలో అందజేశారు. రామసముద్రం దిగువపేటకు చెందిన అస్లాంబాషా కుమార్తె జైబాసుహన కొంత కాలంగా అస్వస్థతకు గురై శస్త్రచికిత్స నిమిత్తం కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించారు. ఈ విషయం తెలుసుకున్న రమేష్‌బాబు విద్యార్థిని చికిత్స నిమిత్తం అవసరమైన సొమ్మును సమకూర్చడానికి ముందుకు వచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది సమక్షంలో రమేష్‌బాబు దంపతులు ఆర్థిక సాయం అందజేశారు.

గుండెజబ్బుకు ప్రథమ చికిత్సపై శిక్షణ

కలికిరి: 108 వాహనంలో విధులు నిర్వహిస్తున్న ఈఎంటీలకు స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో రిసోర్స్ పర్సన్ సోమశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం గుండెజబ్బుల కేసులు అధికమవుతున్న నేపథ్యంలో గుండెజబ్బులకు సంబంధించి చేపట్టాల్సిన ప్రథమ చికిత్స పద్ధతులను ఈఎంటీలకు వివరించారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, గర్భిణుల కేసులకు సంబంధించిన ప్రథమ చికిత్సపైనా సూచనలిచ్చారు. రెండవ రోజు మంగళవారం కూడా శిక్షణ కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో 108 జోనల్ మేనేజర్ చంద్రమౌళి, జిల్లా మేనేజరు శివానందరెడ్డి, సిబ్బంది మనోజ్ రెడ్డి, ఖదీర్ బాషా, సీటీఎం రమణ, గుట్టపాళెం రమణ, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.60 లక్షల నిధులు మంజూరు



మాట్లాడుతున్న ఎంపీడీఓ నారాయణస్వామి

రామసముద్రం: మండలానికి ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.60 లక్షలు నిధులు మంజూరైనట్లు ఎంపీడీఓ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రూ.60 లక్షలతో 19 పనులు మంజూరైనట్లు చెప్పారు. ఈ నిధులతో గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు నిర్మాణం, మురుగునీటి కాలువలు, కల్వర్టులు నిర్మించేందుకు వినియోగించుకోవాలన్నారు. పనులపై అంచనా తయారు చేయాలని సూచించారు. అలాగే జగనన్న కాలనీలైన రామసముద్రం బీసీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, చెంబకూరు, కాప్పల్లె కాలనీలో 51 ఇంకుడు గుంతలు మంజూరైనట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ ఇండ్లు వద్ద నిర్మించుకుంటే ఒకొక్క ఇంకుడు గుంతకు రూ.6 వేలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇళ్లలోని గ్రేవాటర్ ఇంకుడు గుంతల్లోకి మళ్లించడం వలన వీధులు అధ్వాన్నం కాకుండా ఉంటాయన్నారు.

మైనార్టీల సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం



చింతల సాయిక్రిష్ణారెడ్డిని సన్మానిస్తున్న ముస్లింలు

వాల్మీకిపురం: మైనార్టీల సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తనయుడు పీలేరు యువనేత చింతల సాయిక్రిష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కొత్త ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మించిన మసీదును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎళ్లవేలలా కృషి చేస్తున్నారన్నారు. అనంతరం మసీదు అభివృద్ధికి రూ.50వేలు తనవంతు సహకారం అందించారు. అనంతరం ముస్లిం మైనార్టీలు చింతల సాయిక్రిష్ణారెడ్డిని దుశ్శాలవతో సన్మానించారు. మసీదు కమిటీ తరపున హిందూ ముస్లింలకు దాదాపు 700 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముతవల్లి ఇబ్రహీం, సెక్రటరీ సాధిక్, సింగల్ విండో అధ్యక్షులు శ్రీధర్‌రాయల్, అబ్దుల్ కలీం, అషర్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల ద్వారా రైతులకు సామాజిక భద్రత



బ్యాంకు ప్రయోజనాలను వివరిస్తున్న కళాకారులు

గుర్రంకొండ: బ్యాంకుల ద్వారా రైతులకు సామాజిక భద్రత లభిస్తుందని సింగిల్‌విండో చైర్మన్ నక్కాచంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో సింగిల్ విండో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. రైతులకు కలిగే ప్రయోజనాలను పాటల రూపంలో ప్రదర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగిల్‌విండోల ద్వారా రైతులకు పంటరుణాలతో పాటు బంగారంపై రుణాలు కూడా ఇస్తున్నామన్నారు. ప్రధానమంత్రి సురక్షా బీమా యోజనా, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజనా, అటల్‌పెన్షన్ పథకాలతో రైతులకు సామాజిక భద్రత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్లు సింగంశెట్టి రెడ్డికుమార్, నీళ్ల శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి, సీఈవో రమణ, బ్రాంచ్ మేనేజర్ లావణ్య, కళాజాత బృందం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.